بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 11 Sep 2026 (Telugu)

## అల్లాహ్ తఆలాను నమ్ముకొనుట గురించి
## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం ఆధారంగా గొప్ప ఆదర్శం

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 11.09.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత శుక్రవారం నాడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ పై నమ్మకం గురించి ప్రస్తావించడమైనది. నేడు కూడా ఇదే విషయం కొనసాగుతోంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన కోసం అల్లాహ్ పై నమ్మకాన్ని కాంక్షిస్తూ ఏ విధంగా దుఆ చేసేవారో ఒక హదీస్ ద్వారా తెలుస్తోంది. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రుకూకి వెళ్ళినప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు. ఓ అల్లాహ్! నేను నీ కోసమే రుకూ చేశాను, నీ పైనే విశ్వాసం ఉంచాను, నన్ను నేను నీకే అప్పగించుకున్నాను మరియు నీ పైనే ఆశ్రయం పొందాను. నీవే నా రక్షకుడివి. సమస్త లోకాలకు ప్రభువైన అల్లాహ్ ముందు నా వినికిడి శక్తి, నా చూపు, నా రక్తం, నా మాంసం, నా ఎముకలు మరియు నా నరాలు అన్నీ సాష్టాంగం చేస్తున్నాయి.

మరొక ఉల్లేఖనంలో హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు తెలిపినదాని ప్రకారం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. నాకు ఏదైనా ఆందోళన లేదా దిగులు కలిగినప్పుడు జిబ్రీల్ నా ముందుకు వచ్చి, ఓ ముహమ్మద్! మీరు ఇలా ప్రార్థించండి ఎన్నటికీ మరణించని ఆ జీవం ఉన్న సజీవునిపైనే నేను నమ్మకం ఉంచాను. సంతానాన్ని పొందని, తన రాజ్యంలో ఏ భాగస్వామి లేని మరియు బలహీనతలో తనకు సహాయకుడిగా ఉండే ఏ తోడు అవసరం లేని ఆ అల్లాహ్‌కే సమస్త స్తోత్రాలు చెల్లుతాయి. మీరు అతని గొప్పతనాన్ని గట్టిగా ప్రశంసించండి అని చెప్పేవారు. హుజూరె అన్వర్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దృష్టి ఎల్లప్పుడూ అల్లాహ్ తఆలా పైనే ఉండేదని పేర్కొన్నారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ గుణానికి సంబంధించిన అత్యున్నత ప్రమాణాన్ని ప్రస్తావిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఒక ప్రసంగంలో ఈ విధంగా పేర్కొన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్‌పై ఎలాంటి నమ్మకం ఉండేదంటే, ప్రతి కష్ట సమయంలోనూ, సవాలు ఎదురైనప్పుడు ఆయన దృష్టి అల్లాహ్‌పైనే ఉండేది, అల్లాహ్ తప్ప మరే ఇతర విషయం వైపూ దృష్టి సారించేవారు కారు.

ఇందులో ఏమాత్రం సందేహం లేదు. నేటి కాలపు సూఫీల వలె దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం లౌకిక సాధనాలను త్యజించినవారు కారు. ఆయన సాధనాలను ఉపయోగించేవారు. ఎందుకనగా సాధనాలను త్యజించడం అంటే ఒక రకంగా అల్లాహ్ సృష్టిని అవమానించడమే, అతని సృష్టిని వ్యర్థమైనదిగా భావించడమే అవుతుంది. అయితే సాధనాలను సమకూర్చుకున్న తర్వాత ఆయన సంపూర్ణంగా అల్లాహ్‌పైనే భారం వేసేవారు. సాధనాలను సిద్ధం చేసుకున్నప్పటికీ, వాటిపై ఎన్నడూ ఆధార పడలేదు లేదా విశ్వాసం ఉంచలేదు. కేవలం అల్లాహ్ అనుగ్రహం పైనే ఆశలు పెట్టుకునేవారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖనం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తీవ్రమైన ఆందోళన లేదా కలవరం కలిగిన ప్రతి సందర్భంలోనూ ఈ విధంగా

ప్రార్థించేవారు: “లాయిలాహ ఇల్లల్లాహు రబ్బుల్ అర్షిల్ అజీమ్, లాయిలాహ ఇల్లల్లాహు రబ్బుస్సమావాతి వ రబ్బుల్ అర్జి వ రబ్బుల్ అర్షిల్ కరీమ్.” అనగా మహా సింహాసనానికి రక్షకుడైన అల్లాహ్ తప్ప వేరే ఏ ఆరాధ్యుడూ లేడు. అల్లాహ్ తప్ప వేరే ఏ ఆరాధ్యుడూ లేడు, అతడు ఆకాశాలకు రక్షకుడు, భూమికి రక్షకుడు, గౌరవ ప్రదమైన సింహాసనానికి రక్షకుడు. అంటే నా భరోసా, నమ్మకం కేవలం అల్లాహ్ తఆలా పైనే ఉన్నాయి.

హుజూరె అన్వర్ ప్రస్తావిస్తూ వివిధ సందర్భాలలో మక్కా విగ్రహారాధకులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు రకరకాల ఆశ, అవకాశాలు చూపడం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్‌పై సాటిలేని విశ్వాసంతో వారికి సమాధానం ఇవ్వడం గురించి వివరించారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఈ చారిత్రక సంఘటనల చిత్రాన్ని వివరిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ఏకత్వాన్ని ప్రజలకు బోధించడం ప్రారంభించి, విగ్రహారాధనను నిరసించడం మొదలుపెట్టినప్పుడు, మక్కా వాసులకు అది తీవ్ర అసంతృప్తిని కలిగించింది. చివరికి వారొక రోజు ఒక రాయబార బృందంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పిన తండ్రి అబూ తాలిబ్ వద్దకు వచ్చి, మీరు మా జాతికి పెద్దలు, మిమ్మల్ని మేము ఎంతగానో గౌరవిస్తాం. ఆ గౌరవంతోనే మేము మీ అన్నయ్య కుమారున్ని ఇప్పటివరకు ఏమీ అనలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి హద్దులు దాటిపోయింది. అందుకే ఆయనతో మా తరఫున చివరిసారిగా మాట్లాడాలని మీ వద్దకు వచ్చామని చెప్పారు.

అనంతరం ఉత్బా బిన్ రబీఆ గతంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద ప్రస్తావించిన అవకాశాలనే వారు మళ్లీ పునరావృతం చేశారు. అంటే అత్యున్నత కుటుంబానికి చెందిన సంబంధం, అత్యంత అందమైన స్త్రీ, ధనం, ఐశ్వర్యం మరియు పరిపాలనాధికారం వంటి ఆశలు చూపిస్తూ వారిలా అన్నారు: అయితే ఆయనను ఒక్కటి మాత్రం చేయమనండి మా విగ్రహాలను నిందించకుండా ఉంటే చాలు. మా విగ్రహాలను పూజించమని మేము ఆయనను అడగడం లేదు. కేవలం మా దేవుళ్లను తిట్టవద్దని మాత్రమే కోరుతున్నాము. ఆయన ఈ షరతులలో ఏ ఒక్కదానికీ ఒప్పుకోకపోతే, ఇక మీరు ఆయనకు మద్దతు ఉపసంహరించుకోండి, ఆపై ఆయనతో మేమే తేల్చుకుంటాము. అబూ తాలిబ్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను పిలిపించి వారి అవకాశాలను వివరిస్తూ ఆ ఆశను ఆయన ముందుంచారు. ఆయన ఎలాంటి కోరిక కోరినా నెరవేర్చడానికి వారు సిద్ధంగా ఉన్నారు. ఆయన చేయాల్సిందల్లా కేవలం వారి విగ్రహాలను నిందించకుండా ఉండటమే అని చెప్పారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన పినతండ్రి ఈ స్థితిని చూసి, ఆయన చేసిన ఉపకారాలను గుర్తుచేసుకుంటూ కంటనీరు పెట్టుకున్నారు. కానీ ధైర్యంగా ఇలా అన్నారు. ఓ చిన్నాన్నా! మీరు నాకు సహాయం చేయాలని నేను అడగడం లేదు. మీరు నిరభ్యంతరంగా మీ ప్రజలకు తోడుగా ఉండండి, నన్ను ఒంటరిగా వదిలేయండి. అల్లాహ్ ప్రమాణంగా! వీరు నా కుడి చేతిలో సూర్యున్ని, నా ఎడమ చేతిలో చంద్రున్ని తెచ్చి పెట్టినా సరే నేను మాత్రం అల్లాహ్ సందేశాన్ని ప్రచారం చేయడం నుండి వెనక్కి తగ్గను.

హుజూరె అన్వర్ ప్రస్తావిస్తూ ఇది అల్లాహ్ తఆలాపై పూర్తి నమ్మకం మరియు విశ్వాసానికి చెందిన అత్యున్నత స్థానమని, ఇది మరెక్కడా కనిపించదని అన్నారు. ఈ సంఘటనను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఈ విధంగా వివరించారు: విగ్రహారాధకులు అపవిత్రులు, మాలిన్యమైనవారు, సృష్టిలోనే అత్యంత హేయమైనవారు, మూర్ఖులు, సైతాను సంతతి, వారి దేవుళ్లు నరకాగ్ని ఇంధనం, నరకపు కట్టెలు అని ఖుర్ఆన్ సూక్తులు అవతరించినప్పుడు, అబూ తాలిబ్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను పిలిపించి ఇలా అన్నారు: ఓ నా అన్న కుమారుడా! నీ మాటల వల్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. నిన్ను, నీతో పాటు నన్ను కూడా అంతం చేసేలా ఉన్నారు. నీవు వారి బుద్ధిమంతులను మూర్ఖులన్నావు, వారి పెద్దలను సృష్టిలోనే అత్యంత అధములన్నావు, వారు పూజించే దేవుళ్లను నరకపు ఇంధనం, నరకాగ్ని కట్టెలని అన్నావు. సాధారణంగా వారందరినీ అపవిత్రులని, సైతాను సంతతి అని పేర్కొన్నావు. నీ మంచి కోరి చెప్తున్నాను. నీ నాలుకను అదుపులో ఉంచుకో, ఈ మాటలు అనడం ఆపు. లేదంటే ఈ ప్రజలను ఎదిరించే శక్తి నాకు లేదు. దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానమిచ్చారు: ఓ చిన్నాన్నా! ఇది ఎవరినీ నిందించడం కాదు. సత్యాన్ని, యథార్థాన్ని సరైన స్థానంలో స్పష్టం చేయడం మాత్రమే.

నేను పంపబడినది కూడా ఈ పని కోసమే. దీనివల్ల నాకు మరణం సంభవించినా, ఆ మరణాన్ని నేను సంతోషంగా స్వీకరిస్తాను. నా జీవితం ఈ మార్గానికే అంకితం చేయబడింది. మరణ భయంతో నేను సత్యాన్ని ప్రకటించకుండా ఆగలేను. ఓ చిన్నాన్నా! మీకు మీ బలహీనత లేదా కష్టం గురించి చింత ఉంటే, నాకు రక్షణ ఇవ్వడం నుండి మీరు తప్పుకోండి. అల్లాహ్ సాక్షిగా! నాకు మీ ఆశ్రయం అవసరం లేదు. దైవాజ్ఞలను చేరవేయడం నుండి నేను ఎన్నటికీ ఆగను. నా ప్రాణం కంటే నాకు నా యజమాని (అల్లాహ్) ఆదేశాలే మిక్కిలి ప్రియమైనవి. అల్లాహ్ ప్రమాణంగా! ఈ మార్గంలో నేను చంపబడినా, మళ్లీ మళ్లీ జీవించి ప్రతిసారీ ఈ మార్గంలోనే ప్రాణాలు అర్పించాలని కోరుకుంటున్నాను. ఇది భయపడే సమయం కాదు. దైవ మార్గంలో కష్టాలు సహించడంలోనే నాకు అపారమైన ఆనందం లభిస్తుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రసంగం చేస్తున్నప్పుడు ఆయన ముఖంలో సత్యం, దివ్యమైన కాంతితో కూడిన భావోద్వేగం స్పష్టంగా కనిపించింది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మాట్లాడటం ముగించగానే, ఆ సత్య కాంతిని చూసి అబూ తాలిబ్ కండ్ల నుండి అశ్రువులు రాలాయి. ఆయన స్పందిస్తూ: నీలోని ఈ అత్యున్నత స్థితి గురించి నాకు తెలియదు. నీవు వేరొక దివ్యమైన రీతిలో, వేరొక శోభతో ఉన్నావు. వెళ్ళు! నీ పని నీవు చేసుకో. నేను జీవించి ఉన్నంతవరకు, నా శక్తి ఉన్నంతవరకు నీకు తోడుగా ఉంటానని అన్నారు.

ఇదే విధంగా తాఇఫ్ నగరం నుండి తిరిగి వచ్చేటప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దైవ విశ్వాసానికి సంబంధించిన ఒక సంఘటన ఉంది. ఆయన ఒంటరిగా తాఇఫ్ నాయకులకు ధర్మ ప్రచారం చేయడం కోసం బయలు దేరారు. కానీ వారు క్రూరత్వానికి హద్దులు దాటి ప్రవర్తించారు. ఆయన తిరిగి వస్తున్నప్పుడు, బాహ్యంగా చూస్తే మక్కాలో అడుగుపెట్టే అవకాశం కూడా కనిపించడం లేదు. ఆయనతో పాటు ఒక సేవకుడు మాత్రమే ఉన్నాడు. ఇప్పుడు ఏమవుతుందో? అని ఆ సేవకుడు తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. కానీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు మాత్రం తన రక్షకుడైన అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసం, నమ్మకం ఉండెను.

ఈ సంఘటనను వివరిస్తూ ఆ సేవకుడైన హజ్రత్ జైద్ బిన్ హారిసా రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: ఓ దైవ ప్రవక్తా! మక్కా ప్రజలు మిమ్మల్ని వెళ్లగొట్టిన తర్వాత, ఇప్పుడు మీరు తిరిగి మక్కాలోకి ఎలా ప్రవేశిస్తారు? అని నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అడిగాను. దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో గొప్ప విశ్వాసంతో ఇలా సమాధానమిచ్చారు: ఓ జైద్! అల్లాహ్ తఆలా తప్పకుండా ఏదో ఒక మార్గాన్ని సుగమం చేస్తాడని నీవు చూస్తావు. అల్లాహ్ తన ధర్మానికి రక్షకుడు, సహాయకుడు. అతడు తన ప్రవక్తను తప్పక విజేతగా నిల బెడతాడు. అనంతరం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన్ను తమ ఆశ్రయంలోకి తీసుకుని మక్కా ప్రవేశానికి ఏర్పాట్లు చేయవలసిందిగా ఖురైష్ నాయకులకు వర్తమానం పంపారు. అయితే నాయకులందరూ నిరాకరించారు. చివరికి, ముత్ఇమ్ బిన్ అదీ అనే ఒక ఉదారస్వభావం కలిగిన నాయకుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు తన ఆశ్రయం కల్పిస్తూ, మక్కాలోకి ప్రవేశింపజేస్తున్నట్లు ప్రకటించాడు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వలస సమయంలో అల్లాహ్ పై నమ్మకానికి సంబంధించిన ఆదర్శవంతమైన నమూనాలు ఎన్నో ఉన్నాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనాకు వలస చేయడానికి అనుమతి లభించినప్పుడు, ఆయన హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు నకు తన ప్రయాణ ప్రణాళికను తెలియజేశారు. ఆయనకు ఒక ప్రాణత్యాగంతో కూడిన బాధ్యతను అప్పగిస్తూ, ఆ రాత్రి తన పవిత్రమైన పడకపై పడుకోవాలని చెప్పారు. ఒక ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా కప్పుకునే ఎర్రటి రంగు 'హజ్రమీ' దుప్పటిని కప్పుకుని పడుకోవాలని కోరారు. తన ప్రాణాలను సైతం అర్పించడానికి సిద్ధపడిన ఆ సేవకుడికి దైవ సహాయం, మద్దతుపై నమ్మకం కలిగిస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఏమాత్రం చింతించకు, ప్రశాంతంగా నా పడకపై నిద్రపో. శత్రువులు ఏమాత్రం నీ నష్టం కలిగించలేరు.

తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఇంటి నుండి బయటకు వచ్చేశారు. ఆ సమయంలో మక్కా అవిశ్వాసులలోని ఎన్నుకోబడిన శూరులు చేతుల్లో ఖడ్గాలు పట్టుకుని, కళ్లల్లో రక్తం ఉడుకుతుండగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటి బయట అత్యంత అప్రమత్తంగా కాపలా కాస్తున్నారు. రాత్రి బాగా చీకటి

పడగానే అందరూ ఒక్కసారిగా దాడి చేసి, ఒకే దెబ్బతో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాన్ని అంతం చేయాలని వేచి చూస్తున్నారు. (నవూజుబిల్లాహ్) వారి నాయకుడైన అబూ జహల్ తీవ్ర అహంకారంతో, పరిహాసంగా ఇలా అంటున్నాడు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏమంటున్నారంటే మీరు గనుక ఆయన మార్గాన్ని అనుసరిస్తే అరబ్ మరియు అరబేతర ప్రపంచానికి రాజులవుతారట! మరణించిన తర్వాత తిరిగి లేప బడినప్పుడు జోర్డాన్ తోటల వంటి ఉద్యానవనాలు మీకు లభిస్తాయట! ఒకవేళ మీరు అలా చేయకపోతే మీ మధ్య హత్యలు, నరమేధం జరుగుతాయట!

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బయటకు వచ్చి అవును! నేను అదే చెప్తున్నానంటూ యాసీన్ అధ్యాయంలోని 2 నుండి 10 వరకు గల సూక్తులు పఠిస్తూ, వారి తలలపై మట్టి చల్లుతూ వారి ముందు నుంచే వెళ్ళి పోయారు. కానీ దైవ మహిమ ఏమిటంటే ఆయన వెళ్తుంటే వారిలో ఎవ్వరికీ కనిపించలేదు. పైగా వారు మధ్య మధ్యలో ఇంట్లోకి తొంగిచూస్తూ, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ పడకపైనే ఉన్నారని నిశ్చింతగా ఉండిపోయారు.

జుమా ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ వలస సంఘటనను, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విశ్వాసం, ధైర్యసాహసాలను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పంక్తులను ఉల్లేఖించారు: హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి సత్యనిష్ఠ, విశ్వాసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఇల్లు ముట్టడించబడిన ఆ తీవ్ర కష్ట సమయంలో బయటపడింది. అటువంటి పరిస్థితిలో హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు చూపిన సత్యనిష్ఠ, విశ్వసనీయత శాశ్వతంగా ఒక ఆదర్శంగా నిలిచిపోతాయి. శత్రువులు గుహ వద్దకు వచ్చి వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరేమో కాలిబాటల గుర్తులు ఇక్కడి వరకే వచ్చి ఆగిపోయాయి కాబట్టి ఈ గుహను వెతకాలి అంటున్నారు. కానీ మరికొందరేమో ఇక్కడ మనుషులు ప్రవేశించడం ఎలా సాధ్యమవు తుంది? సాలెగూడు అల్లబడి ఉంది, పావురం గుడ్లు పెట్టి ఉందని మాట్లాడుకుంటున్నారు. అటువంటి మాటల శబ్దాలు గుహ లోపలికి వినిపిస్తున్నాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వాటిని స్పష్టంగా వింటున్నారు. శత్రువులు తమను అంతం చేయాలనే పట్టుదలతో ఉన్మాదుల్లా ముంచుకొచ్చినటువంటి సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాటిలేని శౌర్యాన్ని చూడండి! శత్రువు తలపైనే ఉన్నప్పటికీ, తన సత్యసహచరుడైన సిద్దీఖ్ రజియల్లాహు అన్హుతో: 'లా తహ్జన్ ఇన్నల్లాహ మఅనా' బాధపడకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడని అన్నారు. ఈ పదాలు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నోటితోనే స్పష్టంగా మాట్లాడారని తెలియజేస్తున్నాయి. ఎందుకంటే దానికి ధ్వని అవసరం, కేవలం సైగలతో అయ్యే పని కాదు. బయటేమో శత్రువులు ఆలోచనలు చేస్తున్నారు, లోపలేమో సేవకుడు, యజమాని సంభాషించుకుంటున్నారు. బయట ఉన్న శత్రువులకు తమ స్వరం వినిపిస్తుందేమోనన్న భయం కూడా వారికి లేదు. ఇది అల్లాహ్ తఆలాపై ఉన్న సంపూర్ణ విశ్వాసం, దైవజ్ఞానానికి నిదర్శనం. దైవ వాగ్దానాలపై వారికి ఉన్న సంపూర్ణ నమ్మకానికి ఇది నిరూపణ.

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లిమ్.**

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۔